RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 61 Vol: 61 | మార్చి 19 గురువారం 2026 March 19 Thursday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

మూసీపై మాటల యుద్ధం 2

## పాన్ కార్డు నిబంధనల్లో భారీ మార్పులు




న్యూఢిల్లీ, మార్చి 18 జన సంఘర్షణ
మీరు కొత్తగా పాన్ కార్డు పొందాలనుకుంటున్నారా? అయితే ఈ నెలాఖరు లోపు దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. ఎందుకంటే వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1, 2026) నుండి పాన్ కార్డు జారీ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పటివరకు కేవలం ఆధార్ కార్డు సమర్పిస్తే సరిపోయే చోట, ఏప్రిల్ 1 నుండి అదనపు ధృవీకరణ పత్రాలు సమర్పించడం తప్పనిసరి కానుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ కామన్ సర్వీస్ సెంటర్ ప్రజలను అప్రమత్తం చేస్తూ కీలక ప్రకటన విడుదల చేసింది. ఆధార్ ఒక్కటే ఉంటే సరిపోదు.. ప్రస్తుత నిబంధనల ప్రకారం, కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సులభంగా పాన్ నంబర్ కేటాయిస్తున్నారు. అయితే, ఏప్రిల్ 1 నుండి ఈ విధానం మారనుంది. ఇకపై ఆధార్‌తో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. పుట్టిన తేదీ ధృవీకరణ కోసం బర్త్ సర్టిఫికేట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ (పదో తరగతి) సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్ లేదా పాస్‌పోర్ట్ వంటి పత్రాల్లో ఏదో ఒకటి ఖచ్చితంగా ఉండాలని అధికారులు స్పష్టం

➢ మిగతా 2వ పేజీలో..

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు..

- రాజ్యసభ ఓ 'ఓపెన్ యూనివర్సిటీ': - ఎంపీల వీడ్కోలు సభలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ జన సంఘర్షణ:
రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులకు వీడ్కోలు పలుకుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో ఎవరికీ పదవీ విరమణ ఉండదని, సభ నుంచి వెళ్లినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం 59 మంది సభ్యుల పదవీకాలం ముగిసిన సందర్భంగా సభలో జరిగిన చర్చలో ప్రధాని ప్రసంగించారు. రాజ్యసభను మేధావుల వేదికగా అభివర్ణించిన ప్రధాని, ఇక్కడ లభించే జ్ఞానం ఎంతో విలువైనదని కొనియాడారు. "పార్లమెంట్ అనేది ఒక ఓపెన్ యూనివర్సిటీ వంటిది. ఇక్కడ సభ్యులు తమ అనుభవాలతో దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తారు. సభ నుంచి వెళ్తున్న వారు తమ విధులను దేశ నిర్మాణం కోసం కొనసాగించాలి"

➢ మిగతా 2వ పేజీలో..

## మూసీ పేరిట లక్షన్నర కోట్ల దోపిడీ..

డీపీఆర్ లేకపోతే మేం వ్యతిరేకిస్తాం.. అసెంబ్లీలో కేటీఆర్ నిప్పులు



హైదరాబాద్ జన సంఘర్షణ:
మూసీ నది ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయల భారీ దోపిడీకి తెరలేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం శాసనసభలో మూసీ ప్రాజెక్టుపై జరిగిన చర్చలో ఆయన ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వ సమాధానం దాటవేసే ధోరణిలో ఉండటంతో, నిరసనగా బీఆర్ఎస్ సభ్యులతో కలిసి కేటీఆర్ సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, కానీ ప్రణాళిక లేని దోపిడీని అడ్డుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. "గతంలో డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు రెండు నెలల్లోనే ఎలా సిద్ధం చేసింది? అసలు ప్రభుత్వం దగ్గర డీపీఆర్ ఉందా లేదా?" అని నిలదీశారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీనే డీపీఆర్ లేదని చెబుతుంటే, ప్రభుత్వం ఏ ప్రాతిపదికన ఇళ్లను కూల్చుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది 'పునరుజ్జీవం' కాదు, పేదల ఇళ్లపై చేస్తున్న 'గృహ మేధ యాగం' అని మండిపడ్డారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రుణం మంజూరైందని మంత్రి శ్రీధర్ బాబు సభను తప్పుదోవ పట్టించారని కేటీఆర్ ఆరోపించారు.

➢ మిగతా 2వ పేజీలో..

# గవర్నర్ ప్రసంగం తెలంగాణ భవిష్యత్తుకు దిక్సూచి

- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ జన సంఘర్షణ:
గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల చిట్టా కాదని, అది తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు ఒక దార్శనిక పత్రమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ సీఎం పదునైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం రాబోయే రోజుల్లో ఏ దిశగా పయనించాలి, ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేర్చాలనే అంశాలను స్పష్టంగా వివరిస్తూ 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించామని ఆయన ప్రకటించారు.
ప్రధాన ప్రతిపక్షం తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రాజులు పోయినా, రాజ్యాలు పోయినా కొందరిలో రాచరికపు పోకడలు, అహంకారం మాత్రం పోలేదు" అని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు, కనీసం మర్యాదపూర్వకంగా ఆహ్వానించేందుకు కూడా ప్రతిపక్ష నేత కేసీఆర్ రాకపోవడం శోచనీయమన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా, బీఆర్ఎస్ నేతలు ఇంకా అహంకార ధోరణిలోనే ఉన్నారని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ తన బాధ్యతలను విస్మరిస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. డిసెంబర్ 1, 2023 నుంచి ఇప్పటివరకు కేసీఆర్ సుమారు రూ. 1.6 కోట్లకు పైగా జీతభత్యాలు పొందారని, కానీ సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చించడంలో విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. "ఆయనకు ఉన్న అనుభవంతో సభకు వచ్చి ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలి. కానీ ప్రజలు తమను ఓడించి తప్పు చేశారన్నట్టుగా ఆయన ప్రవర్తన ఉంది" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

➢ మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రాలకు అదనంగా 10 శాతం ఎల్‌పీజీ..

గ్యాస్ కష్టాలకు చెక్: కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 18 జన సంఘర్షణ:
అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల దృష్ట్యా దేశీయంగా తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీని సరఫరా చేసేందుకు అంగీకరించింది. అయితే, ఈ అదనపు కోటా పొందాలంటే రాష్ట్రాలు కొన్ని నిబంధనలను పాటించాల్సి ఉంటుందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

➢ మిగతా 2వ పేజీలో..

## ఏపీని ముంచెత్తుతున్న వానలు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు



విశాఖపట్నం, మార్చి 18 జన సంఘర్షణ:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అల్పపీడన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు విస్తరించిన అల్పపీడన ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. విశాఖపట్నం వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

➢ మిగతా 2వ పేజీలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
19 గురువారం, మార్చి 2026

# గవర్నర్ ప్రసంగం

## తెలంగాణ భవిష్యత్తుకు దిక్సూచి

**మొదటిపేజీ తరువాయి..** సభ సంప్రదాయాలను గౌరవించకపోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా అగ్రస్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. గతంలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, నెహ్రూ వేసిన పునాదులే నేటి అభివృద్ధికి మూలమని గుర్తు చేశారు. హైటెక్ సిటీ నిర్మాణంలో పీవీ నరసింహారావు, నేదురుమల్లి జనార్దన్ రెడ్డిల కృషి ఉందని, ఆ తర్వాత చంద్రబాబు, వాజ్‌పేయిలు దానిని కొనసాగించారని పేర్కొన్నారు.

రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల తలెత్తే నిరుద్యోగ సమస్యలు, సవాళ్లను ఎదుర్కోవడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించాలంటే ఇప్పుడే సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుకే మేధావుల సూచనలతో విజన్ డాక్యుమెంట్ తయారు చేశామని వివరించారు. రాష్ట్రాన్ని క్యూర్ , ప్యూర్ రేర్ అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేరుస్తామని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

# పాన్ కార్డు నిబంధనల్లో భారీ మార్పులు

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. కేవలం ఆధార్ కార్డుతో మాత్రమే పాన్ పొందాలనుకునే వారికి మార్చి 31వ తేదీయే తుది గడువు అని వెల్లడించారు. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి పాత పాన్ దరఖాస్తు ఫారాలను అనుమతించే ప్రసక్తే లేదని సీఎస్‌సీ పేర్కొంది. ఏప్రిల్ 1 నుండి కొత్త దరఖాస్తు ఫారాలు అందుబాటులోకి రానున్నాయి. బ్యాంకింగ్ మరియు ఇతర ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డు అత్యంత కీలకం కావడంతో, సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా ముందే ఈ మార్పులను ప్రకటించారు. ఆన్‌లైన్ ద్వారా కొత్త పాన్ కార్డు పొందాలనుకునే వారు ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్లు లేదా ఎన్ఎస్‌డీఎల్ , యూటీఐఐటీఎస్ఎల్ పోర్టల్స్‌ను సందర్శించి మార్చి 31 లోపు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. మరోవైపు, ఇప్పటికే పాన్ కార్డు కలిగి ఉన్న వారు తమ ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవడానికి కూడా మార్చి 31వ తేదీని కీలక గడువుగా పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ గడువులోపు లింక్ చేయని పక్షంలో ఏప్రిల్ 1 నుండి సదరు పాన్ కార్డులు నిష్క్రియం (×అశీజూవతీఖఅజవ) అయ్యే అవకాశం ఉంది. పాన్ కార్డు పని చేయకపోతే బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడం, ఐటీ రిటర్న్స్ దాఖలు చేయడం వంటి పనులన్నీ నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, కొత్త కార్డు పొందాలన్నా లేదా పాత కార్డును అప్‌డేట్ చేయాలన్నా ఈ పది రోజులే అత్యంత కీలకమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# మూసీ పేరిట లక్షన్నర కోట్ల దోపిడీ..

**మొదటిపేజీ తరువాయి..** "మార్చి 11న ఏడీబీ స్పష్టమైన లేఖ ఇచ్చింది. తమకు డీపీఆర్ అందలేదని, రుణం మంజూరు కాలేదని పేర్కొంది. ప్రభుత్వం సభకు పచ్చి అబద్ధాలు చెబుతోంది" అని విమర్శించారు. రూ. 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం వెనుక ఉన్న ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బఫర్ జోన్‌పై స్పష్టత లేదు.. పేదలకు అన్యాయం

బఫర్ జోన్ నిర్ణయంలో ప్రభుత్వం తీవ్ర గందరగోళం సృష్టిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్ వాసులకు నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. 1,400 ఇళ్లు అన్న వారు ఇప్పుడు 10 వేల ఇళ్లకు పైగా నోటీసులు ఇచ్చారని, వేలాది మంది పేదల జీవితాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు ఇవ్వడం కాదు.. బాధితుల వద్దకు వెళ్లి సమాధానం చెప్పండి" అని హితవు పలికారు.

బీఆర్ఎస్ వాకౌట్

ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన విజన్ లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి ఒక మాట, మంత్రులు ఒక మాట చెబుతూ ప్రజలను వంచిస్తున్నారని దుయ్యబట్టారు. పారదర్శకత లేని ఈ ప్రాజెక్టును, పేదల ఇళ్ల కూల్చివేతలను నిరసిస్తూ కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లారు. ఈ చర్చలో ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొని ప్రభుత్వ అస్పష్టతను ఎండగట్టారు.

# రాజాసింగ్‌కు మరోమారు బెదరింపు లేఖ

### చంపేస్తామని బెదరింపులు

**హైదరాబాద్, మార్చి18** : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపు లేఖ రావడం భాగ్యనగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో కూడా ఆయనకు పలుమార్లు అంతర్జాతీయ నంబర్ల నుంచి, సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చినప్పటికీ, ఈసారి ఈనెల 27 స్పష్టంగా పేర్కొంటూ లేఖ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 27వ తేదీలోగా రాజాసింగ్‌ను చంపేస్తామంటూ ఆగంతకులు ఆ లేఖలో హెచ్చరించినట్లు సమాచారం. ఇటీవల ఆయన చేసిన ప్రసంగాలతోనే ఈ బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజాసింగ్ చుట్టూ భారీ భద్రత ఉన్నప్పటికీ, ఇలాంటి లేఖలు రావడం ఆయన అనుచరుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ లేఖ అందిన వెంటనే రాజాసింగ్ కార్యాలయ ప్రతినిధులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ లేఖ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ నివాసం, ఆయన వెళ్లే ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే అవకాశం ఉంది.

# రాష్ట్రాలకు అదనంగా 10 శాతం ఎల్‌పీజీ..

**మొదటిపేజీ తరువాయి..** ఎల్‌పీజీపై ఆధారపడటాన్ని తగ్గించి, పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని కేంద్రం తెలిపింది. రాష్ట్రాలు తమ మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకుంటూ, వినియోగదారులను పీఎన్‌జీ వైపు మళ్లించేలా ప్రోత్సహించాలని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పేర్కొన్నారు. వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత లేకుండా చూడటమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు.అదనపు కేటాయింపుల వివరాలివే..

రాష్ట్రాలు చేసే పనుల ఆధారంగా అదనపు గ్యాస్ కేటాయింపులు ఇలా ఉండనున్నాయి: శాతం అదనంగా: సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తే.

శాతం అదనంగా: డీమ్డ్ సీజీడీ పర్మిషన్ల కోసం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేస్తే. శాతం అదనంగా: రోడ్ల తవ్వకం, మరమ్మతులకు సంబంధించి ప్రత్యేక పథకం ప్రవేశపెడితే. శాతం అదనంగా: వార్షిక రెంటల్ లేదా లీజ్ ఛార్జీలను తగ్గిస్తే.తనిఖీలు ముమ్మరం.. మెరుగుపడిన బుకింగ్ దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు ఈనెల 17న అధికారులు 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సుజాత శర్మ వెల్లడించారు. గ్యాస్ కొరత ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ మెరుగుపడిందని ఆమె తెలిపారు. గ్యాస్ సరఫరాపై ఒత్తిడిని తగ్గించడానికి ఇప్పటికే హాస్పిటాలిటీ, రెస్టారెంట్ వంటి రంగాలకు కిరోసిన్ మరియు బొగ్గును ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నాయని కేంద్రం పేర్కొంది.

# రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు..

**మొదటిపేజీ తరువాయి..** అని ఆకాంక్షించారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి సీనియర్ నేతల సేవలను ఈ సందర్భంగా ప్రధాని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వీరి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సూచించారు.

డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మృదుస్వభావి అని, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే 'ఎవర్‌గ్రీన్' అని మోదీ చమత్కరించారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావడానికి ఉభయ సభల విధానం ఎంతో అవసరమని, ఒక సభలో తీసుకున్న నిర్ణయం రెండో సభలో చర్చకు రావడం వల్ల కొత్త రూపం సంతరించుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

మాతో ప్రేమాయణం.. మోదీతో పెళ్లి: దేవెగౌడపై ఖర్గే ఛలోక్తులు

వీడ్కోలు సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తనదైన శైలిలో హాస్యాన్ని పండించారు. మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ సభలో నవ్వులు పూయించారు. "గత 54 ఏళ్లుగా దేవెగౌడ నాకు తెలుసు. మేమంతా కలిసి పనిచేశాం. కానీ ఏమైందో తెలియదు.. ఆయన మాతో ప్రేమాయణం సాగించి, చివరికి మోదీని పెళ్లి చేసుకున్నారు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి ప్రధాని మోదీతో సహా సభ్యులంతా గట్టిగా నవ్వారు.

రాజకీయాల్లో ప్రజాసేవకు అలసట ఉండదని ఖర్గే అన్నారు. రాందాస్ అథవాలే ఎప్పుడూ తన కవితల్లో మోదీని పొగుడుతుంటారని, ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమోనని ఎద్దేవా చేశారు. శరద్ పవార్, తిరుచ్చి శివ వంటి నేతలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఖర్గే, వారు తిరిగి రాజ్యసభకు వస్తుండటం సంతోషకరమని పేర్కొన్నారు.

మొత్తానికి రాజ్యసభలో పార్టీలకతీతంగా భావోద్వేగపూరిత వాతావరణంలో సభ్యులకు వీడ్కోలు పలికారు. దేశాభివృద్ధిలో సభ్యుల అనుభవాలు నిరంతరం తోడ్పడాలని నేతలు ఆకాంక్షించారు.

# ఏపీని ముంచెత్తుతున్న వానలు

**మొదటిపేజీ తరువాయి..** ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. తీర ప్రాంత జిల్లాలపై వాన ప్రతాపం ప్రధానంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. అమలాపురం, తణుకు, రాజోలు, భీమవరం, గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు జిల్లాలతో పాటు నంద్యాల పరిసర ప్రాంతాల్లోనూ వాతావరణం మేఘావృతమై ఉంది. నూజివీడు ప్రాంతంలో ఇప్పటికే పిడుగులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది.

కన్నీరు పెడుతున్న అన్నదాతలు ఈ అకాల వర్షాలు వ్యవసాయ రంగంపై కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో సుమారు 35,000 హెక్టార్లలో సాగవుతున్న మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లుతోంది. ఈదురుగాలుల ధాటికి మామిడి పూత రాలిపోవడంతో పాటు పిందెలు నేలపాలవుతున్నాయి. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం అప్రమత్తం.. ప్రజలకు సూచనలు

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఉరుములు, మెరుపుల సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, పొలాల్లో ఉన్నవారు చెట్ల కింద నిలబడవద్దని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే అధికారుల సహాయం తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# మూసీపై మాటల యుద్ధం

- మూసీని అడ్డుకుంటున్న విపక్ష బిఆర్ఎస్
- రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డ భట్టి
- డిపిఆర్ సిద్ధం చేశామన్న మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,మార్చి18** : తెలంగాణ అసెంబ్లీ వేదికగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ మరియు ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మూసీ ప్రాజెక్టుపై తెలంగాణ శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మూడోరోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతంలోని పేదల జీవితాలను మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, ప్రతిపక్షం మాత్రం రాజకీయ లబ్ధి కోసం అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు. మూసీ నిర్వాసితుల పునరావాసంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బాధితులకు అదే ప్రాంతంలో అత్యాధునిక అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. నిరుపేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, కానీ నిర్వాసితులు మురికి కూపంలోనే మగ్గిపోవాలని బీఆర్ఎస్ కోరుకుంటోందని ఆయన మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్రం చేయడం మాత్రమే కాకుండా, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మొదటి దశ డీపీఆర్ తయారైందని చెప్పారు. అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7000 కోట్లుగా చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. తుది ఎన్యుమరేషన్ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని.. 2013 చట్టం ప్రకారం అవసరమైన భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని మంత్రి వివరించారు.

అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం సంతృప్తిగా లేదన్నారు. 'డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని జనవరిలో చెప్పారు. పాకిస్థాన్‌లో నిషేధించిన కంపెనీకి అవకాశం ఇచ్చారు. డీపీఆర్‌ను సభ ముందు పెట్టాలి. రుణానికి ఏడీబీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు గతంలో సభలో మంత్రి తెలిపారు. కానీ.. డీపీఆర్ ఇవ్వలేదని.. రుణం మంజూరు చేయలేదని ఏడీబీ స్పష్టం చేసింది. సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారా రూ.16వేల కోట్లతో అయ్యే ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రూ.లక్షన్నర కోట్లు అని చెప్పారు. మొదటి దశ రూ.7వేల కోట్లు

అంటున్నారు.. ఇంకా ఎన్ని దశలు ఉంటాయి? ఎన్ని నివాసాలు కూలుస్తారు? మంత్రి 1,435 నిర్మాణాలు అన్నారు.. గెజిట్‌లో 10వేల నిర్మాణాలు అని పేర్కొన్నారు. వీటిలో ఏది కరెక్ట్?. మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు.. అందులో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకం.'అని కేటీఆర్ ప్రశ్నించారు.

శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. 'ప్రభుత్వం దగ్గర నిధులు లేవు.. ప్రణాళికలు లేవు. ఏడీబీ రుణం ఇవ్వలేదు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు.

# ఐ-ప్యాక్ కార్యాలయంపై ఇడి దాడులు

### మమత అడ్డుకోవడంపై సుప్రీం సీరియస్

**న్యూఢిల్లీ, మార్చి18** : కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంపై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు జరిపిన సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జోక్యం చేసుకోవడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇది హర్షించదగిన పరిణామం కాదని పేర్కొంది. ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో కేంద్ర ఏజెన్సీని ఎలాంటి పరిష్కారం లేకుండా వదిలేయవచ్చా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. మమతాబెనర్జీ జోక్యంపై ఈడీ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం బుధవారంనాడు విచారణ జరిపింది. 'రేపటి రోజు ఇలాంటి రైడ్స్ జరిగినప్పుడు మరో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటే పరిస్థితి ఏమిటి? ఈడీని ఎలాంటి పరిష్కారం లేకుండా వదిలేయవచ్చా?' అని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. ఎలక్షన్ కన్‌స్టలెన్సీ ఐ-ప్యాక్ అధిపతి ప్రతీక్ జైన్ నివాసంపై దాడుల సందర్భంగా ముఖ్యమంత్రి చర్యలను ఈడీ తన పిటిషన్‌లో తప్పుపట్టింది. ప్రతీక్ జైన్ నివాసం నుంచి ల్యాప్‌ట్యాప్, ఫోన్, పలు డాక్యుమెంట్లు తీసుకుని ఆమె వెళ్లిపోవడం పూర్తిగా అధికార దుర్వినియోగమే అవుతుందని పేర్కొంది. ముఖ్యమంత్రితో పాటు అమెతో ఉన్న అధికారులపై పోలీసు కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. కాగా, ఈ కేసు విచారణను మార్చి 24వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో భాగంగా జనవరి 8న ప్రతీక్ జైన్ కార్యాలయంపై ఈడీ దాడులు జరిపింది. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ హుటాహుటిన అక్కడికి రావడం, ఆయన నివాసం నుంచి ఒక ల్యాప్‌టాప్, ఫోన్, పల్ు÷ళ్లు తీసుకుని వెళ్లిపోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది. మమతా బెనర్జీ చర్యలను ఈడీ తప్పుపట్టింది. ముఖ్యమంత్రి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. అయితే ఈడీ దాడులు రాజ్యాంగ విరుద్ధమని మమతా బెనర్జీ తప్పుపట్టారు. అసెంబ్లీ ఎన్నికల వేళ తమ పార్టీ రాజకీయ వ్యూహం, అభ్యర్థుల జాబితా, రహస్య సమాచారాన్ని తెలుసుకునేందుకే ఈడీతో ఈ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. టీఎంసీ పార్టీ హార్డ్‌డిస్క్‌ను తీసుకునేందుకు ఈడీ అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాగా, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనున్నాయి.

# ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**❑ వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి.యాదగిరిరావు.**






నిజామాబాద్ మార్చి 18 జన సంఘర్షణ
తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఈరోజు ప్రారంబమైన మెగా జాబ్ ఫెయిర్ లో 50కు పైగా కంపెనీలు పాల్గొని, 5000కు పైగా ఉద్యోగ అవకాశాలతో ముందుకురాగా 1200 మంది అభ్యర్థుల హాజరయ్యారు. నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ, డిచ్‌పల్లి క్యాంపస్‌లో నిర్వహించిన "మెగా జాబ్ ఫెయిర్--2026" కార్యక్రమాన్ని ఉపకులపతి ప్రొఫెసర్ యాదగిరి రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ జాబ్ ఫెయిర్‌ను నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ యాదగిరి రావు అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..ఈసారి ఉద్యోగం పొందని వారు ఎలాంటి నిరాశ చెందవద్దని, నియామక ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొంటూ అభ్యర్థుల్లో ధైర్యాన్ని నింపారు. అలాగే, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని, ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని అన్నారు. ఈ మెగా జాబ్ ఫెయిర్‌లో టెక్ మహీంద్రా, సుదర్‌లాండ్, టెలిఫర్మామెన్స్, ఆక్సిస్ నిట్, అపోలో ఫార్మసీ, హెటీరో, పేటీఎం, రిలయన్స్ ట్రెండ్స్, ముథూట్ ఫినాన్స్ వంటి 50కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ఈ జాబ్ ఫెయిర్‌లో ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా, నర్సింగ్, బ్యాంకింగ్, రిటైల్, ఎఫ్ఎంసీజీ, హాస్పిటాలిటీ వంటి విభిన్న రంగాల్లో 5000కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంచారు. 10వ తరగతి నుండి పీజీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 1200 మంది అభ్యర్థులు పాల్గొని వివిధ కంపెనీల ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల ప్రతినిధులు (హెచ్‌ఆర్‌లు) మాట్లాడుతూ, అభ్యర్థులను గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ, అవసరమైన ట్రైనింగ్ ప్రక్రియల ద్వారా ఎంపిక చేసి, తగిన జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.తెలంగాణ యూనివర్సిటీ స్థాపన తర్వాత ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన ఈ మెగా జాబ్ ఫెయిర్ యూనివర్సిటీ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్. నాగరాజు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ప్రిన్సిపాల్ ఆచార్య రాంబాబు, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్, ఆచార్య ఆంజనేయులు, డాక్టర్. నాగరాజు, ప్లేస్‌మెంట్ సెల్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టు రట్టు

**❑ ఘరానా నిందితుల అరెస్ట్ వివరాలను కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. సాయి చైతన్య వెల్లడించారు.**








నిజామాబాద్ జిల్లా, మార్చ్ 18 ( జన సంఘర్షణ )
దర్యాప్తు అధికారుల వివరాలు:
బి. శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్, నార్త్ రూరల్, కే. శ్రీకాంత్, ఎస్.ఐ., పి.ఎస్. నవీపేట్.
నిందితుల వివరాలు : ఏ1. షేక్ అర్బజ్ ఏ మయా, నివాసం: శారదానగర్ నయాబాది, బాసర గ్రామం, మండలం ప్రస్తుతం ధర్మబాద్, మహారాష్ట్ర ఏ2. పేరు షేక్ ఆరిబ్, ఖుద్వయినగర్ చౌరస్తా, ఇత్వార్ (పో), దెగ్లూర్ నాఖా, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర, ఏ3. షేక్ రెహమాన్ , నివాసం. మహబూబ్య కాలనీ మోసంబి క మల్ల నాందేడ్ (పరారీలో ఉన్నాడు), ఏ4. పేరు షేక్ అర్బాజ్ రెహ్మత్ నివాసం: రాంనగర్ ధర్మాబాద్ గ్రామం, మండలం నాందేడ్ జిల్లా మహారాష్ట్ర(రిసీవర్), ఏ5. పేరు సోన్ కాంబ్లె మనోజ్ శంకర్ నివాసం. జరికోట్ గ్రామం ధర్మాబాద్ తాలూకా నాందేడ్ జిల్లా మహారాష్ట్ర (రిసీవర్), ఏ6. షెర్ అలి షాదుల్ షేక్, నివాసం: టెంభుర్ని గ్రామం నాయగావ్ తాలూకా నాందేడ్ జిల్లా మహారాష్ట్ర(రిసీవర్), ఏ7. అవేజ్ నివాసం బాసర గ్రామం మరియు మండలం (రిసీవర్, పరారీలో ఉన్నాడు). షేక్ ఇమ్రాన్ ఏ అబూ ఏషేక్ సమీర్ తండ్రి షేక్ సలీం, వయస్సు. 20 సంవత్సరాలు, కులం ముస్లిం, వృత్తి మైత్రి నివాసం. శారద నగర్ బాసర గ్రామం, మండలం (పరారీలో ఉన్నాడు)
కేసుల వివరాలు:
నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలోని బాసర, ముధోల్, భైంసా, తానూర్, నవీపేట్, మాక్లూర్, రెంజల్, వర్ని తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 15 కేసులు డిటెక్ట్ చేయబడ్డాయి. అయితే షేక్ అర్బజ్ఏ మాయ, షేక్ ఇమ్రాన్ ఏ అబూ ఏ షేక్ సమీర్ అనువారు గతంలో బైక్, చైన్స్ స్నాచింగ్ దొంగతనాలు చేయగా నిజామాబాద్ నాల్గవ టౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపడం జరిగింది. వీరిపై గతంలో 10 కేసులు కలవు. దర్యాప్తులో భాగంగా గత రెండు సంవత్సరాలుగా షేక్ అర్బజ్ఏ మాయ, షేక్ ఇమ్రాన్ ఏఅబూఏషేక్ సమీర్, షేక్ ఆరిబ్, షేక్ రెహమాన్, అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి, నిజామాబాద్ , నిర్మల్ జిల్లాల పరిధిలో గల వివిద మండలలో పల్సర్ బైక్ లు లక్ష్యంగా దొంగతనాలు చేయడం ప్రారంబించినారు, ఈ నలుగురు కలిసి దొంగతనం చేసినటువంటి సుమారు 17 బైకులను బాసరకు చెందిన ఆవేజ్, ధర్మాబాద్‌కు చెందిన షేక్ అర్బాజ్ రెహమత్, సోంకాంబ్లే మనోజ్, షేర్ షాదుల్ షేక్ అనువారు తక్కువ ధరకు కొనడం జరుగుతున్నది, వీరి వద్ద నుండి పైన తెలిపినటువంటి 17 బైక్లను రికవరీ చేయడం జరిగింది. వీరిని తేదీ 17.03.2026 రోజున సాయంత్రం 4.30 గం. లకు అయ్యప్ప టెంపుల్ నవీపేట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా, పోలీస్ వారిని చూసి పారిపోతుండగా నిందితులను పట్టుకోవడం జరిగినది. పోలీసులు సాంకేతిక ఆధారాలు, సమాచారంతో గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి రెండు జిల్లాలకు చెందిన 15 కేసులను చేధించారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచీ రిమాండ్‌కు పంపబడును.
అభినందనలు:
కేసు చేధనలో నిజామాబాద్ డివిజన్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, సిసిఎస్ ఐ/సి ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో నార్త్ రూరల్ సి.ఐ బి.శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ డి.సాయినాథ్, ఎస్సై మహేష్, నవీపేట్, ఎస్.ఐ కె.శ్రీకాంత్, సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్ ఠాకుర్ రాజేందర్ సింగ్, సిసిఎస్ కానిస్టేబుల్స్ రవికృష్ణ, సర్దార్ నరేష్ యాదవ్, నరేష్ కుమార్, వసీం, రాజేంద్రప్రసాద్, క్రైమ్ పార్టీ హెచ్‌సి రాజేశ్వర్, రాజారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, దత్తు గౌడ్, రాకేశ్, నాగరాజు, శంకర్, బాస్కర్, ఇతర సిబ్బంది అందరిని, ఇతర సిబ్బంది ప్రతిభ కనబరిచారు. వారి సేవలను కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.సాయి చైతన్య అభినందించారు.

# తరోడా పల్లె దవాఖానా పునఃప్రారంభం

**❑ డింహెచ్‌ఓ తక్షణ స్పందనకు ఏఐపిఎస్యు ధన్యవాదాలు**



ముధోల్ మార్చి 18 (జన సంఘర్షణ)
నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని తరోడా గ్రామ పల్లె దవాఖానాలో నెలకొన్న సమస్యలపై ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ చేసిన ఫిర్యాదుకు జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించింది. దవాఖానా తాళం వేసి ఉన్న విషయాన్ని ఏఐపిఎస్యు జిల్లా కార్యదర్శి గడిపాల పరమేశ్ (నాని) అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజేందర్ తక్షణమే స్పందించి, సంబంధిత సిబ్బందిని సమన్వయపరిచి దవాఖానా తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గడిపాల పరమేశ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తమ ఫిర్యాదును స్వీకరించి వెంటనే చర్యలు తీసుకున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు ఇలాగే బాధ్యతతో స్పందిస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు.

**ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలు**

దవాఖానా పునఃప్రారంభం పట్ల హర్షం వ్యక్తం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న పలు సమస్యలను కూడా ఆయన వెల్లడించారు.
సిబ్బంది కొరత: వేలాది జనాభా ఉన్న గ్రామానికి కేవలం ఒకే ఆశా వర్కర్ ఉండడం వల్ల సేవలు సరిగా అందడం లేదు.
డాక్టర్ డ్యూటీ వ్యవస్థ: డాక్టర్ మూడు రోజులు ఇక్కడ, మరో మూడు రోజులు వేరే చోట విధులు నిర్వహించడం వల్ల రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
సిబ్బంది అందుబాటు లోపం: నర్సులు ఫీల్డ్ వర్క్ కారణంగా దవాఖానలో అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది.

# సిసి రోడ్డు పనులు ప్రారంభం



ఎల్లారెడ్డి.మార్చ్ 18 (జనసంఘర్షణ)
మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో బుధవారం సిసి రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. గ్రామంలోని బాలమణి ఇంటి నుంచి జీవన్ ఇంటి వరకు నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు రూపాయలు ఐదు లక్షల వ్యయం కాలినట్లు గ్రామ సర్పంచ్ అయ్యల సాయిలు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహేందర్, నాయకులు గొల్లపల్లి మల్లేష్, నిచ్చెన మహేందర్, మంద్రు చిరంజీవిలు తదితరులు ఉన్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**❑ పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్**



మార్చ్ 18( జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లా బిక్నూరు మండలం జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రశాంత వాతావరణం, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, పరీక్షలకు హాజరైన విద్యార్థుల హాజరు శాతం, తదితర వాటిపై ఆరా తీశారు.ఈ తనిఖీలో విద్యాశాఖ అధికారి రాజు, సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు కాంగ్రెస్ నాయకులు



మార్చ్ 18( జన సంఘర్షణ)
బిబిపేట మండలంకు చెందిన కాంగ్రెస్ మాజీ ప్రతినిధులు బాయికాడి బాలయ్య, ఆది రాజయ్య, పరశురాములు, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గొప్ప గోవర్ధన్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్ హైదరాబాద్ లోని తన నివాసంలో మాజీ వైస్ ఎంపీపీ బాయికాడ బాలయ్య , మాజీ మార్కెట్ డైరెక్టర్ ఆది రాజయ్య, పరశురాములను టిఆర్ఎస్ కాండవ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు చెయ్యనందున మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సరైన విధానం లేకపోవడం కాంగ్రెస్ పార్టీ నాయకులలో సఖ్యత లేకపోవడమే పార్టీ నుండి వైదులినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పనికి ప్రేమ్ కుమార్, బిబిపేట మండల టిఆర్ఎస్ నాయకులు నందకుమార్, మహంకాళి, పరశురాములు, ఇమ్మడి చంద్రం పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో ఉగాది ఘనంగా వేడుకలు




లింగంపేట్: మార్చ్ 18 (జనసంఘర్షణ)
లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలు ప్రధానోపాధ్యాయులు సిద్ధాంతి వేషధారణలో పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది తెలుగు ప్రజలకు నూతన సంవత్సరం అన్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడి జీవితంలోని సుఖ దుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఇస్తుంది అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ పండుగను జరుపుకుంటున్నమాని అన్నారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లోనూ, ఉపాధ్యాయులు పంతుళ్ల వేషధారణలోను అలరించారు. ఉగాది పచ్చడిని స్వీకరించి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పద్మ, శివానంద, విద్యార్థులు పాల్గొన్నారు.

# రబింద్రా స్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలు




ముధోల్, మార్చి 18 (జన సంఘర్షణ)
ముధోల్ మండలంలోని రబింద్రా హై స్కూల్, ప్లే స్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఘనంగా నిర్వహించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగను విద్యార్థుల్లో సాంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు ఉగాది ప్రాముఖ్యతపై వివరించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు (ముగ్గులు) వేసి ఉగాది సొబగును ప్రతిబింబించారు. ఉగాది పచ్చడి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి, జీవితంలో సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఉపాధ్యాయులు తెలియజేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంచి పెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్లే స్కూల్ ఇంచార్జ్ హేమలత, సంధ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
గురువారం
19 మార్చి 2026

# బాసర ట్రిపుల్ ఐటీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్
- విద్యార్థి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్న పటేల్

బాసర, మార్చ్18 (జన సంఘర్షణ)

2014వ సంవత్సరం నుండి బాసర ట్రిపుల్ ఐటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన త్రిబుల్ ఐటీ సమస్యలపై మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ట్రిపుల్ ఐటీ విద్యార్థి తేజస్విని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ఘటన జరిగిందన్నారు. సరైన వైద్య సేవలు అందకపోవడం మూలంగానే ఒక నిండు ప్రాణం బలైంది అన్నారు. ట్రిపుల్ ఐటీలో సమస్యలు రాజ్యమేలుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ఆరు సంవత్సరాల క్రితం అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ కొన్ని కంప్యూటర్లు మాత్రమే ఇచ్చారని, విద్యార్థులకు కంప్యూటర్లు, ల్యాప్టాప్‌లు లేకపోవడం వలన విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేకపోతున్నారన్నారు. పేర్లు మార్చి అదే మెస్ కాంట్రాక్టర్లు సంవత్సరాల తరబడి ఉంటున్నారని, నామినేషన్ పద్ధతిని తొలగించి టెండర్లు వేయాలన్నారు. ట్రిపుల్ ఐటీ పర్యవేక్షణకు పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, విద్యావంతులతో కూడిన ఒక కమిటీని వెయ్యాలన్నారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నియామకాల ప్రక్రియ పారదర్శకంగా లేదని, సమస్యలు అడిగితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని అధికారులు విద్యార్థులను బెదిరిస్తున్నారని అన్నారు అక్కడ ఉన్న బేకరీ యజమాని ఇష్టనుసారం గా వ్యవహారిస్తూ అధిక ధరలకు అమ్మి విద్యార్థులను నిలువుగా దోచుకుంటున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. 28 ప్యాకేజీ కి నిధులు ఇవ్వండి. ప్రాణ హిత చేవళ్ల 28 ప్యాకేజీ పనులు పూర్తిఅయితే ముధోల్ నియోజకవర్గం లో 50 వేల ఎకరాల కు సాగు నీరు అందుతుందని నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అసెంబ్లీ లో కోరారు. కేవలం ఎకరానికి 75 వేలు మాత్రమే సాగునీటికి ఖర్చు అవుతున్నాయని తక్షణమే నిధులు ఇస్తే మా నియోజకవర్గం సస్యశామలం అవుతుందన్నారు. గత ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా 28 ప్యాకేజీ పూర్తి కాలేదని ఇప్పటి ప్రభుత్వం అయినా దృష్టి సారించాలని కోరారు. కరెంటు సమస్య తీర్చండి. నియోజకవర్గంలో మొక్క జొన్న, వరి పంటలు అధికంగా సాగుచేస్తారని, ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో అంతరాయం తో పంటలకు రైతులు నీరు అందించలేక పోతున్నారని, సమస్యను తీర్చాలని ఎమ్మెల్యే అసెంబ్లీ లో కోరారు.. మరొక్క 33/ 11 కె. వి. సబ్ స్టేషన్ మంజూరు చేయాలన్నారు.




# ఆపరేషన్ క్రాక్ డౌన్

- నిజామాబాద్ జిల్లా పోలీసులు-సైబర్ నేరాలపై ప్రత్యేక ఆపరేషన్



నిజామాబాద్ సిటీ, మార్చ్ 18( జన సంఘర్షణ )

జిల్లాలో ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో, అక్రమంగా బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేసి, వాటిని మధ్యవర్తుల ద్వారా సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్న ఒక నెట్‌వర్క్‌ను నాల్గవ టౌన్ పోలీసులు సైబర్ క్రైమ్ పోలీసు ల సహాయంతో విజయవంతంగా బట్టబయలు చేశారు. ఈ కేసులో భాగమైన నిందితులను ఈ రోజు అరెస్ట్ చేయడం జరిగింది. వీరు వివిధ నెంబర్లతో, ఫేక్ సర్టిఫికెట్స్ పెట్టి బిజినెస్ బ్యాంక్ అకౌంట్లు తెరిచి, వాటిని సైబర్ మోసగాళ్లకు అందించడం ద్వారా భారీ స్థాయిలో మోసాలకు సహకరించినట్లు దర్యాప్తులో బయటపడింది. ప్రాథమిక విచారణలో, ఈ అకౌంట్ల ద్వారా కేవలం మూడు నెలల వ్యవధిలో సుమారు రూ.31 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించాం. ఈ మొత్తాన్ని వివిధ రకాల సైబర్ మోసాలకు వినియోగించినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ కేసులో ఇంకా లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. మరికొంతమంది వ్యక్తులు ఇందులో ప్రమేయం ఉన్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. వారిని త్వరలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

అరెస్ట్ చేసిన నిందితులు:

1. మొహమ్మద్ అజర్ (28), డ్రైవర్, రేంజల్ బేస్, బోధన్, 2. శ్యామల నవీన్ (30), డెయిరీ ఫార్మ్, ఏకచక్ర నగర్, బోధన్, 3. ఖాసిం పటేల్ (25), ఉద్మీర్ గల్లి, బోధన్,
4. మొహమ్మద్ మినాజ్ అహ్మద్ (35), ఫ్రూట్ వ్యాపారం, రేంజల్ బేస్, బోధన్, 5. సయ్యద్ హఫీజ్ (32), డీలక్స్ మొబైల్ షాప్, షర్బతి కాలువ, బోధన్.

పైన పేర్కొన్న నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు పంపించడం జరిగింది.

**ప్రజలకు సూచనలు**

మీ బ్యాంక్ అకౌంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు ఇవ్వకండి లేదా అమ్మకండి. ఓటిపి, పిఐఎన్, సివివి వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోకండి. తెలియని కాల్స్, లింక్స్, మెసేజెస్‌పై నమ్మకం పెట్టుకోకండి. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పే ఆఫర్లను నమ్మకండి. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్ కు కాల్ చేయండి లేదా సైబర్‌క్రైవమ్.జీఓవీ.ఇన్ లో ఫిర్యాదు నమోదు చేయండి.

ప్రజలకు విజ్ఞప్తి : సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం అత్యంత కీలకం. పోలీస్ శాఖ మీ భద్రత కోసం ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ ఉంటుంది.

# లారీని నిర్లక్ష్యంగా నిలిపివేయడంతో బైక్ ఢీకొని యువకుడు మృతి

ముధోల్, మార్చి 18 (జన సంఘర్షణ)

ముధోల్ మండలంలోని విట్టోలి గ్రామానికి చెందిన మార్కంటి దత్తు (41) పోలీస్ స్టేషన్ ముధోల్‌లో ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, మార్చి 18వ తేదీ తెల్లవారుజాము తన మేనమామ కుమారుడు మార్కంటి అనిల్ (33) కూరగాయల వ్యాపారం కోసం మోటార్ సైకిల్ పై భైన్సా వైపు బయలుదేరాడు. ముధోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపానికి చేరుకున్నప్పుడు, రోడ్డుపై లారీ ను నిర్లక్ష్యంగా నిలిపివేయడంతో, అనిల్ వెళ్తున్న బైక్ ఆ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడిపడి తలకు సహా శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలు పొందడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తరువాత విచారణలో లారీ డ్రైవర్ సయ్యద్ అసద్, భైన్సా నివాసి అని తెలిసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# నాగభూషణ విద్యాలయంలో ముందస్తు ఉగాది వేడుకలు





ముధోల్, మార్చ్ 18 (జన సంఘర్షణ)

బాసర మండలంలోని నాగభూషణ పాఠశాలలో బుధవారం ముందస్తు ఉగాది పండుగ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా పాఠశాల ఆవరణలో పచ్చటి తోరణాలతో మండపమును ఏర్పాటు చేశారు. వేద పండితులు నాగేష్ అప్ప ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల మధ్య శివ పార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా పాఠశాలలో కలశ పూజ, శివలింగానికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఉగాది రోజు సెలవు రోజు రావడంతో ముందస్తుగా పాఠశాల ఆవరణలో పండగ వాతావరణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జారికొటే బాబురావు మాట్లాడుతూ.. ఉగాది పచ్చడి తయారు చేసే విధానం ,ఉగాది యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తూ పాఠశాల ఆవరణలో ఉగాది సంబరాలు జరుపుకోవడంతో విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాలను, ప్రతి పండుగ యొక్క విశిష్టతను తెలుసుకుంటారని అన్నారు. అందుకే ప్రతి పండగను పాఠశాలలో విద్యార్థులతో జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో షడ్రుచులు గల ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సులోచన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పరాభవించకే ఉగాది

హైదరాబాద్,మార్చి 18 (జన సంఘర్షణ):



ఉషస్సుల ఊహలతో ఊరేగే ఊపిరిలం
ఆశల ఆశయాలతో
ఆకలి పరుగుల జీవితం
మట్టికి రక్తదానం చేసి
మనిషికి బువ్వను పెట్టే
రైతుని పరాభరించకే ఉగాధి
పేగులకుప్పను దారాలు చేసి
ఒంటికి వస్త్రాన్నిచ్చే
నేతన్నను పరాభరించకు
కూలీ నాలి
కర్షక కార్మిక శ్రామిక
స్వేదాలు చిందించే
ఉత్ప త్తిధారుల్ని పరాభవించకే ఉగాది
పరాక్రమాల ప్రభావాలు
ప్రపంచదేశాల పన్నాగాలు
పైచేయి పెత్తనపు
ప్రమాధ యుద్ధాలు
ప్రపంచ వినాష విషపన్నాగాలను
పరాభవించవే ఉగాది
శాంతిని నింపవే ఉగాది.

**-కొండూరి. కోటిబాబు హైకోర్టు అడ్వకేట్ ఎస్పిటియు, హైదరాబాద్.**

# ఇల్లు కాలిన బాధితుని ఆర్థిక సహాయం అందిస్తున్న బీర్కూర్ మండల నాయకుడు మియ్యాపురం శశికాంత్

మార్చ్ 18( జన సంఘర్షణ)

బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మచ్కురి కిష్టయ్యకు చెందిన నివాసపు ఇల్లు ఇటీవల అగ్నికి ఆహుతి అయి తీవ్ర నష్టం వాటిల్లింది. ఇది గమనించిన బీర్కూర్ మండల నాయకుడు మియ్యాపురం శశికాంత్ 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారం శ్రీనివాస్ 5 వేల రూపాయలు,ప్రతాప్ రెడ్డి 2వేల రూపాయలు మొత్తం 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లో బీర్కూర్ మండల నాయకులు కార్యకర్తలు, సర్పంచ్ శంకర్, శ్రీనివాస్ రెడ్డి, కవిత పండరి, సాయిలు, హన్మంత్ రెడ్డి, శ్రీను, రాజు, దోసాయి వెంకన్న, కుమ్మరి చిన్న సాయిలు, గోపాల్ రెడ్డి, కుర్మా మొగలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 300 మంది భక్తులతో గోటి తలంబ్రాల దీక్ష

రుద్రూర్/మార్చ్ 18/(జనసంఘర్షణ)

- రుద్రూర్ విఠలేశ్వర మందిరంలో తలంబ్రాల తయారీ
- నిజామాబాద్ నుండి భద్రాచలానికి తలంబ్రాలు
- రామకోటి రామరాజుకు విఠలేశ్వర కమిటీ సన్మానం
- మొదటి సారి మా గ్రామానికి తలంబ్రాలు రావడం అదృష్టమన్న భక్తులు



భద్రాచల సీతారాముల కళ్యాణానికి అందించే గోటి తలంబ్రాల కార్యక్రమం కోటి తలంబ్రాల దీక్ష నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామంలోని విఠలేశ్వర మందిరం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భద్రాచలం నుండి తీసుకొచ్చిన గోటి తలంబ్రాకు పూజలు జరిపి 300మంది భక్తులచే 3గంటల పాటు రామనామ స్మరణ చేయిస్తూ గోటితో వడ్లను ఓలిచి తలంబ్రాలుగా మార్చారు. భక్తులు అక్కడే రామకోటి రామరాజుకు అందజేశారు. 4సారి కళ్యాణానికి 3క్వింటాల గోటి తలంబ్రాలు తెలంగాణ రాష్ట్రం నుండి అందిస్తున్నామని రామకోటి రామరాజు తెలిపారు. మేము భద్రాచలం వెళ్లలేక పోయిన కూడా, మేము ఓలిచే తలంబ్రాలు మొదటి సారిగా భద్రాచల కళ్యాణానికి వెళ్లడం ఎన్నో జన్మల పుణ్యఫలం భక్తులు ఆనందాన్ని వెళ్లుబుచ్చారు. ఇంతటి అదృష్టాని అందించిన రామకోటి రామరాజును కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సునీత, చంద్రశేఖర్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమ పథకాల సాధనకై మాదిగ దండోరా..

- మార్చ్ 30న నిరాహార దీక్ష హైదరాబాద్ ఇంద్ర పార్క్‌లో దీక్షకు ఎస్సీ లకు తరలిరావాలని పిలుపు
- కామారెడ్డి జిల్లా అధ్యక్షులు భూమయ్య మాదిగ
- బిచ్కుంద మండల జిల్లా కామారెడ్డి..

మార్చ్ 18 (జన సంఘర్షణ)



ఎస్సీ సంక్షేమ పథకల సాధనకై మాదిగ దండోరా మార్చ్ 30నా నిరాహార దీక్ష కు హైదరాబాద్ ఇంద్ర పార్క్ లో జరగబోయే దీక్షకు రావాలని ఎస్సీ కులాలు అందరూ రావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ ఆదేశాల మేరకు ఈరోజు బిచ్కుంద జుక్కల్ మండలంలో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షులు భూమయ్య మాదిగ నియోజకవర్గ ఇన్చార్జ్ వెండి యాదవరావు, మండల అధ్యక్షులు ఆయిల్ వార్ మారుతి, ప్రధాన కార్యదర్శి సురేష్ మాదిగ, మారుతి, రవి, హన్మాండ్లు, రాజు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత..

మార్చ్ 18 (జన సంఘర్షణ)



అకారణంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో హాస్టళ్లు, హోటళ్లు, ఇళ్లలో వంట కోసం కట్టెల పొయ్యిలను మళ్ళీ ఉపయోగిస్తున్నారు. సిలిండర్ బుకింగ్ గడువు 45 రోజులకు పెరగడం, సరఫరా తగ్గడంతో చాలామంది కట్టెల పొయ్యి లేదా ఇతర ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నారు.
గ్యాస్ సంక్షోభం – ప్రధాన కారణాలు:
హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని హాస్టళ్లలో గ్యాస్ లేక కట్టెల పొయ్యిలపై వంట. గ్యాస్ బుకింగ్ సిస్టమ్ నెమ్మదించడం, సిలిండర్ల కొరత. హోటళ్లు చిన్న వ్యాపారాలు కట్టెల పొయ్యిలతో నడుస్తున్నాయి. ప్రత్యామ్నాయాలు: గ్యాస్ లేని పక్షంలో, ప్రజలు కట్టెల పొయ్యిలకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ స్టవ్స్ లేదా ఇండక్షన్ స్టవ్స్‌ని ఉపయోగించవచ్చు. బయోమాస్ కట్టెల పొయ్యిలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.గ్యాస్ బుకింగ్ నియమాలు:గ్యాస్ సబ్సిడీ, సరఫరా నిబంధనలలో మార్పులు, కొరత కారణంగా బుకింగ్స్ ఆలస్యం అవుతున్నాయి. ప్రస్తుతం కట్టెల పొయ్యిల వాడకం వల్ల పొగ సమస్య పెరుగుతోంది మరియు నగర ప్రాంతాల్లో ఇది ఒక పెద్ద సవాలుగా మారింది.

## జానకంపేటలో ఉపసర్పంచ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు..

ఎడపల్లి: మార్చ్ ,18 ( జన సంఘర్షణ )



ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో బుధవారం సాయంత్రం గ్రామంలోని మజీద్ వద్ద గ్రామ ఉపసర్పంచ్ నీలం కృష్ణ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు తరలివచ్చి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. గ్రామంలో ప్రజలందరూ కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెదులుతారని ఉపసర్పంచ్ తెలిపారు.

## శేరిలింగంపల్లి ప్రజానీకానికి శ్రీ పరాభవ నామ సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు

- చిర్రా రవీందర్ యాదవ్
- ప్రతి కుటుంబం సుఖశాంతులతో, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని వేడుకోలు.
- ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యాలు నింపాలని ఆకాంక్ష.



హైదరాబాద్, శేరిలింగంపల్లి, మార్చి 18 (జన సంఘర్షణ):
శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజానీకానికి పరాభవ నామ సంవత్సరాది ఉగాది శు భాకాంక్షలను ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ తెలిపారు. పరాభవ నామ సంవత్సరాది ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యం, ఐశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఉగాది కొత్త ఆరంభాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం సుఖశాంతులతో, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి తప్పితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి చేసింది ఏమి లేదు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరవేస్తామని శేరిలింగంపల్లి ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

## ముస్లింల అభివృద్ధికి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది

- టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్



హైదరాబాద్, కూకట్పల్లి, మార్చి 18 (జన సంఘర్షణ):
ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుతం కృత నిశ్చయంతో ఉందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈద్ ముబారక్ కిట్లను ఆయన బుధవారం రోజు బేగంపేట ప్రకాష్ నగర్ లోని ముస్లిం మహిళలకు అందజేశారు. వారికి రంజాన్ శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ముస్లిమ్స్ కోసం ప్రభుత్వం ప్రకటించిన పథకాలను ఉపయోగించుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా రమేష్ సూచించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పర్వేజ్, నరేష్, అలీ,రమాదేవి, చర్, సుజిత్ గౌడ్, అరుణ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ రోజు మన భిర్కూర్ లయన్స్ క్లబ్ క్లినిక్ నీ బోధన్ లయన్స్ కంటి, జనరల్ ఆసుపత్రి..

మార్చ్ 18 (జన సంఘర్షణ)




అధినేత మాజీ లయన్స్ డిస్ట్రిక్ 320-ఙ గవర్నర్ పొలవరపు బస్వేశ్వర రావు సందర్శించడం జరిగింది. రాబోయే రోజుల్లో ఇంకా కొన్ని కంటికి సంబంధించిన పరికరాలు అందుబాటులో ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగింది.ఈ కార్య క్రమంలో లయన్స్ అధ్యక్షులు సీతలె రమేష్ , రీజియన్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ పల్లెంపాటి శ్రీధర్, లయన్స్ సీనియర్ సభ్యులు మేకల విఠల్, కిషోర్ ప్రభు దాస్, దావులూరి హరినాథ్ పాల్గొన్నారు.

# హై టెన్షన్ రోడ్డులో నిర్మించిన శిల్ప బృందావనం గేట్లను వెంటనే తొలగించాలి

- నిరసన చేపట్టిన శంషీగూడ స్థానిక ప్రజలు




హైదరాబాద్,కూకట్ పల్లి,మార్చి 18 (జన సంఘర్షణ):
కూకట్ పల్లి మున్సిపల్ ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శంషీ గూడకు చెందిన ప్రజలు బుధవారం రోజు శిల్ప బృందావనం గేటు ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రగతి నగర్ లోని ప్రణీత్ ఆంటీలియా తరహాలో శంషీగూడలో శిల్పా బృందావనం, సాయి హిల్స్ వాసులు కూడా రహదారిని కబ్జా చేసి గేట్లను ఏర్పాటు చేసరని ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజలు రోడ్డెక్కారు. ఈ శంషీ గూడా గ్రామ ప్రజలు మాట్లాడుతూ శనివారం, ఆదివారాలు వస్తే శంషీ గూడ నుండి ఎల్లమ్మబండకు వెళ్లడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని ఆరోపించారు. శిల్ప బృందావన్ నివాసాలు అన్ని హెచ్ఎండిఏ లేఔట్ తో ఏర్పాటుచేసి గేటెడ్ కమ్యూనిటీ అంటూ రహదారిని మూసివేసారని అన్నారు. అదేవిధంగా సాయి హిల్స్ వాసులు కూడా రోడ్డుపై గోడ నిర్మాణం చేపట్టడం పైన ఇప్పటికే డిప్యూటీ కమిషనకు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. తమకు స్పీకింగ్ ఆర్డర్లతో పాటు వీటిని తొలగించాలని ఆదేశాలు ఉన్న ఎవరూ పట్టించుకోకపోవడంతో హైడ్రా కమీషనర్ రంగనాథ్ ను సైతం ఆశ్రయించి ఫిర్యాదు చేశామని తెలిపారు. వీటి పైన విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఈ రోడ్డును ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని దీని ద్వారా మియాపూర్ నుండి వచ్చేవారు నేరుగా గాజులరామారం వెళ్లేందుకు వీలు ఉంటుందని తెలిపారు. శిల్ప బృందావన్ లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆలయానికి భక్తులు రాకుండా సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ధర్మకర్తగా వ్యవహరిస్తూ ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడని ఆరోపించారు. లోపల ఉన్న పార్కును సైతం అభివృద్ధి చేసి కాలనీవాసులు అందరికీ ఉపయోగపడేలా చూడాలని అన్నారు. గేట్లు ఏర్పాటుచేసి లోపల జరిగే తతంగం పైన ప్రభుత్వం విచారణ చేపట్టి వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దార్గుపల్లి గోపాల్, దార్గుపల్లి సురేందర్, సుధాకర్, ప్రభాకర్, శ్యామ్ రావు, లింగం, కె.సత్యనారాయణ, భీమ్ రావు,గణేష్, కృష్ణ, జె. ప్రభాకర్, ఎం.దర్శన్, డి ప్రభాకర్, ఎం.రమేష్, కె పోచయ్య, జె.కిరణ్, కె.రవి అధిక సంఖ్యలో మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.ఎ.ల్ లో ఘనంగా ఉగాది వేడుకలు


హైదరాబాద్, కూకట్పల్లి, మార్చి 18 (జన సంఘర్షణ):



ఉగాది పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం రోజు హెచ్.ఎ.ల్ లో వెల్ఫేర్ ఫండ్ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్. ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహనరావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకొని కార్మికులందరికీ పరాభవ నామ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ కొత్త సంవత్సరంలో కూడా హెచ్.ఎ.ల్ అనుకున్న టార్గెట్స్ సకాలంలో పూర్తి చేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజైన్ జనరల్ మేనేజర్ సతీష్, చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ, వెల్ఫేర్ ఫండ్ ఛైర్మెన్ శ్రీహరి రావు,హెచ్.ఆర్ చీఫ్ మేనేజర్ ప్రహ్లాద్, రాము, సీనియర్ మేనేజర్ జయశ్రీ, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కన్వీనర్ వెంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్స్, కర్క నాగరాజు, గణేష్, చంద్రరావు నాయక్, డిప్యూటీ ప్రధానకార్యదర్శి జోగారావు, కోశాధికారి ప్రవీణ్, మహిళా నాయకులు భాగ్య, నీలవేణి, మంజుల, సునీత, భారతి, జాహ్నవి, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ప్రవీణ్, ప్రేమ్, వెంకటరమణ, ఆదిరెడ్డి, రాకేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పండుగ ఉగాది

మార్చ్ 18( జన సంఘర్షణ)



తాడ్వాయి మండలం వివిధ గ్రామాల్లో , ఉగాది తెలుగు కొత్త సంవత్సర పండుగ, శ్రీ పరాభవనామ సంవత్సరం గురువారం రోజున ఇల్లను శుభ్రం చేసి మంగళ్ల లతో అలంకరించి, గ్రామ దేవతలకు కొబ్బరికాయలు కొడుతూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ గ్రామదేవతల దేవాలయాలు చుట్టూ అలంకరించిన ఎడ్ల బండ్లను గళ్ళు గళ్ళు గంట చప్పుడులతో గుడిచుట్టూ ప్రదక్షిణతో, రైతులు ఆనందంగా పండుగలు నిర్వహిస్తారు. ఉగాది పండుగ పూర్వీకులు తెలిపిన మాటల్లో ప్రకృతి పండుగ శీతాకాలం ముగిసి, వసంత రుతువు మొదలయ్యే సమయం లో చెట్లు చిగురించి, కోయిలల కుహూకుహూలతో ప్రకృతి కొత్త అందాన్ని సంతరించుకుంటుంది.
పంచాంగ శ్రవణం: బ్రాహ్మణ పంతులు దేవాలయాల వద్ద ఉగాది పండుగ రోజున ఉదయం పంచాంగ శ్రవణం భక్తి వివరాలు తెలియజేస్తూ గ్రామ ప్రజలు దేవాలయాలలో, ఆన్లైన్లో టీవీ ప్రసారాలలో ఇంట్లో పంచాంగం వినడం ద్వారా రాబోయే రోజులలో జరగబోయే శుభ, అశుభాలను తెలుసుకుంటారు. ఉగాది పచ్చడి సేవిస్తూ ఆనందంగా కుటుంబ సభ్యులతో ఉగాది పండుగను జరుపుకుంటారు.

# ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు.
- తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ఉండలేమంటూ స్థానికుల ఆవేదన.

హైదరాబాద్, శేరిలింగంపల్లి, మార్చి 18 (జన సంఘర్షణ):
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షంషీగూడ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ మజీద్ గల్లి లైన్ బ్లాక్ నెంబర్ 143 నివాస గృహాల మధ్య తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ముక్కు మూసుకొని ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలకు పైగా ఎల్లమ్మబండ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే వార్డు, మున్సిపల్ కార్యాలయంలో ఒకటికి, రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం,సిబ్బంది నిర్వాకం శాపంగా మారిందని ఆ డివిజన్ ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తంతా నెలల తరుబడి పేరుకపోవడంతో గాలి వీచిన సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అప్పుడు ఇళ్లలో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.మురికి నీరు కాలనీలో రోడ్లపైనే పొంగి పొర్లుతూ ఉండటం వలన దోమలు, పందులు స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ దుర్గంధం కారణంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యకం చేస్తున్నారు. చుట్టు పక్కల వారు సైతం రాత్రి వేళల్లో వచ్చి ఇక్కడి చెత్తను పడేసి వెళ్తున్నారని వాపోతున్నారు.ఈదురు గాలులకు చెత్తంతా ఇళ్లలోకి వస్తుండటం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొంటున్నారు. మున్సిపల్ సంబంధిత పారిశుధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఈ ప్రధాన సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ సరైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం, తరచుగా డ్రైనేజీ లీకేజీలు, పూడిక తీయకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. స్థానిక ప్రజలు జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మున్సిపల్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



# గుంపెల్లగూడెంలో సేవా స్ఫూర్తి వెల్లివిరిసింది



ఖమ్మం సింగరేణి :ప్రతినిధి:( జన సంఘర్షణ)
ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గుంపెల్లగూడెం గ్రామంలో ఇటీవల నిర్వహించిన సేవా కార్యక్రమం గ్రామ ప్రజల హృదయాలను హత్తుకుంది. సమాజానికి చేయూత అందించాలని సంకల్పంతో హైదరాబాద్‌కు చెందిన సిఐ శివ, ఆయన స్నేహితుడు సందీప్ నల్గొండ కలిసి “రీచ్ అవుట్ ద సెంటర్” ఎన్జీవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి-పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. చిన్నారులు ఆనందంతో ఉత్సాహంగా ఈ సామగ్రిని స్వీకరించగా, వారి ముఖాల్లో కనిపించిన సంతోషం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చదువులో ముందుకు సాగేందుకు ఇవి ఉపయోగపడతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా గ్రామంలోని వృద్ధులు, వితంతువులను ఆదుకోవాలనే ఉద్దేశంతో వారికి బ్లాంకెట్లు పంపిణీ చేశారు. చలికాలంలో ఈ బ్లాంకెట్లు ఎంతో ఉపయోగపడతాయని గ్రామ పెద్దలు తెలిపారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కృష్ణవేణి వీరబాబు, మండల ఎంపీడీవో, ఉప సర్పంచ్, గ్రామ సెక్రటరీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను వారు అభినందించారు. ఈ సందర్భంగా సిఐ శివ మాట్లాడుతూ, ‘ పిల్లలు రేపటి పౌరులు..వారు మంచి విద్యతో, విలువలతో ఎదగాలి. గ్రామాల్లో ఉన్న ప్రతిభకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉంది” అని అన్నారు. సందీప్ నల్గొండ కూడా సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని పేర్కొన్నారు.గ్రామం పట్ల ఉన్న ప్రేమతో, సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ సేవా కార్యక్రమం గుంపెల్లగూడెం గ్రామాన్ని సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలబెట్టింది. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా జరగాలని గ్రామస్తులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.



# ఎస్.ఎస్.సి పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించిన పోలీస్ కమిషనర్

నిజామాబాద్ మార్చ్ 18 ( జన సంఘర్షణ )

నేడు ఎస్ఎస్సి పబ్లిక్ ఎగ్జామ్ రెండవ పేపర్ అయినా హిందీ , తెలుగు నిర్వహించడం జరుగుతుంది. నిజామాబాద్ నగరంలో గల ఎస్ ఎఫ్ ఎస్ హైస్కూల్ , రవి స్కూల్ పరీక్ష కేంద్రాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, తనిఖీలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల చుట్టూ ముట్టు ఎలాంటి జిరాక్స్ సెంటర్లను తెరిచి ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని , ఎలాంటి మాస్ కాపింగ్ కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా టౌన్ 3 పి.ఎస్ ఎస్.ఐ శ్రీ జి. నారాయణ, హెడ్మాస్టర్ ఆనంద్ , సిట్టింగ్ స్క్వాడ్ ఇంచార్జ్ మహమ్మద్ అలీ, మల్లికార్జున్ సిఎస్, నవీన్ డిపార్ట్మెంటల్ అధికారి తదితరులు పాల్గొనడం జరిగింది.



# పిట్లంలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం





◆ ఆడబిడ్డల ఆరోగ్యానికి భరోసా, క్యాన్సర్ నివారణకు కీలక అడుగు..

పిట్లం: మార్చ్ 18( జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గర్భాశయ క్యాన్సర్ నివారణ కార్యక్రమంలో భాగంగా పిట్లం మండల కేంద్రంలో న్యూఎ వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఆడబిడ్డల ఆరోగ్య రక్షణకు ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆడపిల్లలకు టీకాలు అందించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ, చిన్న వయస్సులోనే టీకాలు వేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో పిట్లం మండలానికి చెందిన స్థానిక నాయకులు, సర్పంచులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆడబిడ్డల ఆరోగ్యమే కుటుంబం, సమాజం భవిష్యత్తు -టీకాతో సురక్షితమైన రేపటికి బాటలు!

# బాన్సువాడ పట్టణంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు..







మార్చ్ 18( జన సంఘర్షణ)

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి . ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన పోచారం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాన్సువాడ పట్టణ, రూరల్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, ముస్లిం సోదరులు.

# జిల్లా ప్రజలకు ఉగాది,రంజాన్ పండుగ శుభాకాంక్షలు

◆ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మార్చి 18 (జన సంఘర్షణ)

శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రతి ఇంట్లో సుఖసం తోషాలు, ఆరోగ్య సౌభాగ్యాలను నింపాలని కోరుకుంటూ.. అలాగే పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలందరికీ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి, మీనా, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడులు ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు జిల్లా ప్రజలకు తెలియ జేశారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో ఉగాది పండుగకు ప్రత్యేకత ఉందని.. పులుపు, తీపి, వగరు, చేదు, ఉప్పు, కారం అనే ఆరు రుచుల కలయి కగా ఉగాది పచ్చడిని రూపొందిస్తామని, వైద్య పరంగా ఈ ఉగాది పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుందన్నారు. ఈ పరాభవనామ తెలుగు సంవత్సరంలో ప్రకృతి అన్నివిధాలా కరుణిం చిజిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి.. సిరుల పంటలు పండా లన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా వారు అభిలషించారు. ఆధ్యాత్మికంగా చూస్తే జీవితం సుఖదుఃఖాల మిశ్రమం అని చెప్ప డమే ఉద్దేశ్యంగా ఉగాది జోష్యం చెబుతోందన్నారు. జీవన గమనం శు భాశుభాల మిశ్రమం అని గ్రహి స్తూనే, రాబోయే రోజులకి సిద్ధపడాలని సూచించే సంప్రదాయమే మన “పంచాంగం” అన్నారు. అందుకే సంవత్సరపు మొదటి రోజైన ఉగాది నాడు పంచాంగ శ్రవణం తప్పక ఆచరించడం మన ఆనవాయితీ అని గుర్తు చేశారు.పవిత్రత, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల మేళవింపు పర్వదిన మైన రంజాన్ పండుగ ను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపు కోవాలని కోరారు. ప్రభుత్వ సుపరిపాలన, బాధ్యత, నిబద్ధత, సంక్షేమ పథకాల ఫలాలతో.. రాష్ట్ర ప్రజల జీవితాల్లో ప్రతిరోజు పండుగలా. సంతోషాల సౌరభాలు వెల్లివిరుస్తు న్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తస్థాయిలో అందడంతో.. ప్రతీ ఇంటా పండుగ శోభ సంతరించుకుంది. ఈ రంజాన్ పండుగ సందర్భంగా.. అందరికీ అల్లాహ్ ఆశీస్సులు, దీవెనలు అందాలని ఆకాంక్షించారు.



# జగ్గుతండా పంచాయతీ ప్రభుత్వ భూమిపై రియల్ మాఫియా కన్ను

◆ గ్రామస్థుల్లో ఆందోళన

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి. ( జన సంఘర్షణ )

బయ్యారం మండలంలోని జగ్గుతండా గ్రామపంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమి రియల్ ఎస్టేట్ దందా కబంధహస్తాల్లో పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 11 మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వివిధ మార్గాల్లో ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో పిల్లలు ఆడుకునే స్థలం, ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ భూమిని వ్యాపార ప్రయోజనాల కోసం వినియోగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ భూమి అన్యాక్రాంతం అయితే భవిష్యత్తులో గ్రామ ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని వారు పేర్కొన్నారు.గ్రామ పెద్దలు, గిరిజనులు ఈ అంశంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరుతున్నారు. “మన కళ్లముందే భూమి పోతుంటే చూస్తూ ఊరుకోలేం. గ్రామ ప్రజలందరూ ఒక్కటై ఈ భూమిని కాపాడుకోవాలి” అని పిలుపునిస్తున్నారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, భూమి ఆక్రమణలను అడ్డుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రావోజి తండ గ్రామపంచాయతీ రికార్డుల తనిఖీ




◆ అధికారుల కీలక ఆదేశాలు

ఖమ్మం సింగరేణి ప్రతినిధి :(జన సంఘర్షణ )

సింగరేణి మండలంలోని రావోజి తండ గ్రామపంచాయతీ రికార్డులను మండల పంచాయతీ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామపంచాయతీ ద్వారా వసూలు చేసిన పన్నులను ట్రెజరీలో జమ చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు సంబంధించిన ఇన్సూరెన్స్ రిన్యువల్ పూర్తి చేసి, సంబంధిత పత్రాలను ట్రాక్టర్ డ్రైవర్‌కు అందజేశారు. ట్రాక్టర్‌కు సంబంధించిన అన్ని పత్రాలను సురక్షితంగా ఉంచుకోవాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని డ్రైవర్‌కు సూచించారు.
99 రోజుల ప్రణాళికకు సంబంధించిన రికార్డులను ‘బిఫోర్ - ఆఫ్టర్’ విధానంలో సక్రమంగా సిద్ధం చేసి ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలో చేయాల్సిన పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.బాలు, ఎంపీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఎంపీడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒకే రోజు రెండు హామీలు అమలు చేసిన కూటమి ప్రభుత్వం

◆ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

చిత్తూరు, మార్చి18 (జన సంఘర్షణ)



రాష్ట్రంలోని నారా చంద్ర బాబు నాయుడు సారథ్యం లోని కూటమి ప్రభుత్వం ఒకేరోజు రెండు హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపాడు. బుధవారం ఎమ్మెల్యే ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కూటమి ప్రభుత్వం రంజాన్ కానుకగా ఇమామ్, మౌజమ్ లకు గౌరవ వేతన నిధులు రూ.45 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. వీటితో పాటుగా అమరావతిలో కొత్తగా హజ్ హౌస్ నిర్మాణం చేపట్టడానికి, కడపలో హజ్ హౌస్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. హామీ ఇచ్చిన మూడు నెలల్లోనే హామీని అమల్లోకి తీసుకువచ్చి దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని సుమారు 11 లక్షల మంది దివ్యాంగులకు ఎంతో మేలు జరుగుతుందని, దివ్యాంగుల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని గుర్తు చేశారు.

# జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లా-జనసంఘర్షణ:

పరాభవ నామ సంవత్సర ఉగాది మీ ప్రతి ఇంటికి సంతోషం, శాంతి, సంపదలను తీసుకురావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో నిండిపోవాలని, రైతులు పుష్కల పంటలతో ఆనందంగా ఉండాలని, యువత తమ లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఉగాది మన సంప్రదాయాల సుగంధాన్ని, ఆశల వెలుగును తీసుకొచ్చే పర్వదినం. ఈ శుభసందర్భంగా మనం అందరం ఐక్యంగా ముందుకు సాగుతూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని, ప్రజలందరికీ మరోసారి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# శాంతినికేతన్ ఎస్.ఎన్ హై స్కూల్లో ముందస్తు ఉగాది వేడుకలు








**జగిత్యాల జనసంఘర్షణ. :**
జగిత్యాల కృష్ణా నగర్ లోని శాంతినికేతన్ ఎస్.ఎన్ హై స్కూల్ లో బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ముందస్తు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను మామిడి తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. విద్యార్థులు తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా దుస్తులు ధరించి హాజరయ్యారు. ఉపాధ్యాయులతో కలిసి ఉగాది పచ్చడి తయారు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సంధ్యారాణి, ప్రిన్సిపల్ గొల్లపెల్లి రాజు మాట్లాడుతూ... విద్యార్థులకు పండుగలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఉగాది వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు..

## కాలభైరవ స్వామి ఆలయంలో అమావాస్య వేడుకలు

**-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్ జనసంఘర్షణ :**
ఉప్పల్ బగాయత్ ప్రాంతంలోని ప్రసిద్ధ కాలభైరవ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ పవిత్ర వేడుకల్లో ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్యంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా ఎమ్మెల్యే భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలభైరవ స్వామి వారి దయాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం తాను నిరంతరం కృషి చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు.అమావాస్య సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## మృతుడి కుటుంబానికి భీమా చెక్ అందజేత

**శంకరపట్నం జనసంఘర్షణ :**
మండల కేంద్రం కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి మరణించిన వ్యక్తికి రూ. 20 లక్షల ప్రమాద బీమా చెక్కుని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన అంతం బాపురెడ్డి గత సంవత్సరం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు.మృతుడు కేశవపట్నంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి ఎస్బిఐ వారి జనరల్ ఇన్సూరెన్స్ రూ. 1000 లతో ప్రమాద బీమా పొందగా క్లైయిమ్ చేసి బీమా కింద రూ. 20 లక్షల రూపాయల చెక్ ని బుధవారం గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ తో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ బడుగు బాలరాజు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ రూ. 1000 నుండి 3000 రూపాయల వరకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ లు ఉన్నాయని, ప్రమాదం అనేది ఎప్పుడు ఎలా జరుగుతుందో తెలియదు, కష్టపడి కుటుంబాన్ని పోషించే ఇంటి యజమాని అనుకోని ప్రమాదానికి గురై మరణం సంభవిస్తే కుటుంబ సంరక్షణ కోసం ప్రమాద బీమాను ప్రతి ఒక్క ఖాతాదారుడు పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎం ఓ సుబ్బారావు,డిఓఎఫ్ఐ దేవరాజ్, బ్రాంచ్ మేనేజర్ పింగళి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది సిహెచ్. శ్యామల,వి. రేణుక, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మండల ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు

**సుజాతనగర్ ఎస్సై రమాదేవి**

**సుజాతనగర్ జనసంఘర్షణ**
సుజాతనగర్ మండల ప్రజలకు సబ్ ఇన్స్పెక్టర్ రమాదేవి పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వారు మట్లడుతు, అందరూ ఈ ఉగాది పండుగనాడు సంతోషంగా ఉండాలని అందరికీ మంచి జరిగి మండలం అంతా సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా తెలియజేశారు. ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీశివ శంకర మహా మాయి దేవాలయంలో పాల్గుణ మాస అమావాస్య వేడుకలు

**-వైభవంగా అమ్మవారికి విశేష పూజలు**

**- అన్నప్రసాద వితరణతో భక్తుల సందడి**

**ఉప్పల్ జనసంఘర్షణ :**
ఉప్పల్ ప్రాంతంలోని శ్రీశివ శంకర మహా మాయి దేవాలయంలో పాల్గుణ మాస అమావాస్య సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.ఉదయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో నిండిపోయి భక్తి భావంతో మార్మోగింది.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు పడి మరియు అన్నప్రసాదాన్ని ఘనంగా పంపిణీ చేశారు. ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతం సందడిగా మారింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సమకూర్చారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పాల్గుణ మాస అమావాస్య రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతుందని



తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించగలిగామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు ఉప్పాజి



బలవంత చారి, బిక్షపతి, రాజగోపాల చారి, పవన్, చోల్లేటి శ్రీనివాస్, శ్రీధర్, మందుముల అంజిరెడ్డి, శామీర్పేట హనుమంత్ రెడ్డి, బజార్ జగన్నాథ్ గౌడ్, కృష్ణారెడ్డి, గొంది ప్రశాంత్ రెడ్డి, గౌతమ్, జగన్, నర్సింహా రెడ్డి, శేఖర్, రావి, శ్రీనివాస్, గుండాల అనిల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నర్సింహారావు, నర్సింగ్ రావు, తురాయి దాస్, మహేష్, రామ్ ప్రకాష్, గోపి చారి, పసుపు నేటి రమేష్, వెంకటయ్య, కుమార్, భాస్కర్, నవీన్ గౌడ్, రాజు, సందీప్, మహేష్ కుమార్, ప్రశాంత్ కుమార్, పవన్ కుమార్, భవాని శంకర్, లక్ష్మణ్, సంతోష్ కుమార్, బంటి, శ్రీను, శ్రీనివాస్ గౌడ్, గణేష్ గౌడ్, యది గౌడ్, వెంకటేష్ తదితరులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధిలో కార్మికుల సేవలు అమూల్యం

**వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్**

**కోరుట్ల రూరల్ జనసంఘర్షణ :**
గ్రామ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న కార్మికుల సేవలు అమూల్యమైనవని కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది మ్యకల నరేష్, పారిశుద్ధ్య కార్మికులు ఎండి రసూల్, ఊరుమడ్ల నాగరాజు, పిట్టల నరసయ్య లను గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ద్యాగ గంగాధర్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి పరిశుభ్రతలో పంచాయితీ సిబ్బంది కీలక



పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం గ్రామ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న కార్మికుల సేవలు అమూల్యమైనవి అన్నారు. వారి కృషిని గుర్తించి సన్మానించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ ఉపసర్పంచ్ పిట్టల రాజేశ్వరి శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి మంతెన నరేష్, వార్డు సభ్యులు రైతా, పిట్టల శివకుమార్, సంగర్తి సంజీవ్, బర్కం బక్కన్న, పులి



రాములు, ఓరుగంటి సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విఠల్ రవీందర్ రెడ్డి బర్కం చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీ బర్కం నర్సయ్య, చైర్మెన్ కటుకం రాజేష్ నేత, బాజోజి రవీందర్, ఐకేపీ అధ్యక్షురాలు మధులత ఆశావర్కర్లు అంగన్వాడీ టీచర్లు ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

# శాంషీగూడలో రహదారి మూసివేతపై ప్రజల ఆందోళన

**-గేట్లు,గోడలతో రహదారిని అడ్డుకుంటున్నారంటూ ఆరోపణలు**

**-జిహెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్**

**కూకట్పల్లి జనసంఘర్షణ :**
ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని శాంషీగూడ ప్రాంతంలో రహదారిని మూసివేస్తూ గేట్లు ఏర్పాటు చేసిన ఘటనపై స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. ప్రగతి నగర్ పరిధిలోని ప్రణీత్ ఆంటీలియా తరహాలోనే శాంషీగూడలోని శిల్పా బృందావనం, సాయి హిల్స్ నివాసులు రహదారిని ఆక్రమించి గేట్లు ఏర్పాటు చేసి ఇతరులను రాకుండా అడ్డుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం, ఆదివారాల్లో శాంషీగూడ నుండి ఎల్లమ్మబండకు వెళ్లేందుకు సాధారణంగా ఉండే ప్రయాణం రెండు గంటలకు పైగా పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎండిఏ లేఔట్గా అభివృద్ధి చేసిన ప్రాంతాన్ని గేటెడ్ కమ్యూనిటీగా మార్చి ప్రజా రహదారిని మూసివేయడం అన్యాయమని అన్నారు.సాయి హిల్స్ ప్రాంతంలో రహదారిపై గోడ నిర్మాణం చేపట్టిన విషయంపై ఇప్పటికే డిప్యూటీ కమిషనర్లు, ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ సమస్యపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ను కూడా ఆశ్రయించి ఫిర్యాదు చేయగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మియాపూర్ నుండి గాజులరామారం వరకు ప్రయాణం సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శిల్పా బృందావనంలో ప్రభుత్వ



భూమిపై నిర్మించిన ఆలయానికి భక్తులను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాలనీలోని పార్కును అభివృద్ధి చేసి అందరికీ ఉపయోగపడేలా చేయాలని, గేట్ల వెనుక జరుగుతున్న వ్యవహారాలపై ప్రభుత్వం విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.ఈ ఆందోళన కార్యక్రమంలో దార్గుపల్లి గోపాల్, దార్గుపల్లి సురేందర్, సుధాకర్, ప్రభాకర్, శ్యామ్ రావు, లింగం, కె. సత్యనారాయణ, భీమ్ రావు, గణేష్, కృష్ణ, జె. ప్రభాకర్, ఎం. దర్శన్, డి. ప్రభాకర్, ఎం. రమేష్, కె.

# ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలి

**శ్రీపరాభవనామ సంవత్సరం పాడిపంటలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి**

**అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**కొత్తగూడెం జనసంఘర్షణ**
ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. బుధవారం ఆయన భద్రాద్రి జిల్లా ప్రజలకు, నియోజకవర్గ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి పులకించే ఈ వసంత కాలంలో ప్రారంభమయ్యే 'శ్రీ పరాభవనామ సంవత్సరం' రాష్ట్ర ప్రజలందరికీ పాడిపంటలతో పాటు సుఖసంతోషాలను అందించాలని కోరారు. షడ్రుచుల సమ్మేళనమైన



ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని నేర్పుతుందని, అదే స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా తాను నిరంతరం శ్రమిస్తానని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా పండుగను జరుపుకోవాలని సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు ఆయన వివరించారు.




## ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

### తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఉగాది శుభాకాంక్షలు**

**హైదరాబాద్, మార్చి18 :**

తెలుగు ప్రజలను ప్రముఖులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. కొత్త సంవత్సరంలో అంతా శుభం జరగాలని ఆకాంక్షించారు. గవర్నర్లు అబ్దుల్ నజీర్, శుక్లా, సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, విపక్ష నేతలు కెసిఆర్, జగన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోడీ కూడా తెలుగు ప్రజలకు ఉగాధి శుభాకాంక్షలు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటినుంచిశ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co